సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 30 | నవంబర్ | 2023



నిందితుల కోసం గాలింపు

పుల్లలపాడులో తుపాకీతో దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావును హత్యచేసిన కేసులో నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.


8లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన వీరమల్లు సూర్యానారాయణ, లక్ష్మీ సూర్యవతి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 3,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యంగానే ఉన్నా.. ఆందోళన వద్దు : మంత్రి వేణు



పరామర్శించేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: తాను సంపూర్ణ ఆరోగ్యంగానే ఉన్నానని, ఎవరూ కలత చెందవద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఇటీవల మంత్రి వేణు స్వల్ప అస్వస్థతకు గురై తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం రామచంద్రపురంలోని స్వగృహానికి చేరుకున్నారు. బుధవారం ఆయనను పరామర్శించేందుకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పెద్దఎత్తున వచ్చారు. ఆయన కొద్దిసేపు వారితో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొద్ది రోజుల్లోనే యథావిధిగా కార్యక్రమాల్లో పాల్గొంటానని మంత్రి వేణు అన్నారు.

కళా ఉత్సవాల బ్రోచర్ల ఆవిష్కరణ



కళా ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ ప్రతాప్, కవులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 16, 17 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు, తెలుగు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్ల ఆవిష్కరణ అమలాపురం దాబా గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు నిర్విరామంగా ప్రపంచ రికార్డుకు సంబంధించిన ఈ కార్యక్రమ బ్రోచర్లను ఆ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సాహిత్య, కళా ఉత్సవాల్లో అధిక సంఖ్యలో కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, వేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, మహిళా కార్యదర్శి కుంపట్ల సుభాషిణీ అరుణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు 'ఆకెళ్ల'

రాజోలు: స్థానిక జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న ఆకెళ్ల త్రిపుర యజ్ఞేశ్వరి విలువిద్య క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.గణేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో యజ్ఞేశ్వరిని ప్రిన్సిపాల్, డీఐఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల పీడీ ఎం.అంబేడ్కర్, డిగ్రీ కళాశాల పీడీ బి.మధుకుమార్, రిటైర్డ్ ఎంఈఓ జె.గోపాలకృష్ణ, ఎస్‌ఎస్‌ఎస్ పీఈటీ జె.రాజబాబు, పి.నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలోని కొబ్బరి పీచు పరిశ్రమల్లో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కొబ్బరి పీచు పరిశ్రమల సంఘాల సభ్యులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 48 కొబ్బరి పీచు తయారీ పరిశ్రమలున్నాయన్నారు. వాటికి అనుబంధంగా నడుస్తున్న సుమారు వెయ్యి సూక్ష్మ పరిశ్రమల్లో తయారు చేసే కొబ్బరితాళ్ల విదేశీ ఎగుమతులు కోవిడ్ అనంతరం మందగించాయన్నారు. ఆయా పరిశ్రమల్లో కొత్త ఉత్పత్తులు తయారు చేసేలా, ప్రభుత్వ పరంగా మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ద్వారా ప్రతి రోడ్డు నిర్మాణంలో జియో టెక్స్‌టైల్ ఉపయోగించేలా జీఓ ఇప్పించాలని ఏపీ క్వాయర్ అసోసియేషన్ కార్యదర్శి రాణి శ్రీనివాస్‌శర్మ, కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ అధ్యక్షుడు వేగి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఆర్.సూర్యనారాయణరాజు, కటికిరెడ్డి గంగాధర్, అడ్డాల గోపాలకృష్ణ కోరారు. సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆక్వాయే ముంచేస్తోంది

- గొంది, నొవ్వా, రాళ్ల డ్రెయిన్‌ల సమస్యలు అదే ప్రధాన కారణం
- చెరువుల నుంచి డ్రెయిన్లలోకి అధికంగా నీరు
- అందుకే ముంపు బారిన పడుతున్న వరి చేలు
- అధ్యయన కమిటీ పరిశీలనలో బహిర్గతం
- త్వరలోనే సమస్యకు పరిష్కారం: కలెక్టర్ హిమాన్షు శుక్లా



గొంది అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు ఏర్పాటు చేసిన తేలికపాటి షట్టర్లు



గొంది అవుట్‌ఫాల్ స్లూయిస్ పనితీరును పరిశీలిస్తున్న అధ్యాయన బృందం

సాక్షి, అమలాపురం: రాజోలు దీవిలో వరి సాగుకు ప్రధాన అవరోధంగా మారిన డ్రెయిన్లు.. అవుట్ ఫాల్ స్లూయిస్‌ల ప్రక్షాళనకు నిపుణుల కమిటీ పలు సూచనలు చేసింది. వరి చేల ముంపునకు కారణాలను అన్వేషిస్తూనే.. డ్రెయిన్ల ఆధునీకరణ, పూడిక తొలగింపు, అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతులు, కొత్త గేట్ల ఏర్పాటు వంటి వాటిని చేపట్టాలని సూచించింది. సఖినేటిపల్లి మండలం గొంది, నొవ్వా, రాళ్ల డ్రెయిన్‌లతో కలుగుతున్న పంట పొలాల ముంపుపై ఆయకట్టు రైతులు పలు సందర్భాల్లో చేసిన ఫిర్యాదులకు స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యయన కమిటీని నియమించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నీటి వినియోగదారుల సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి), ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, డ్రెయిన్స్ ఇంజినీరింగ్ అధికారులతో అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయకట్టు వరి రైతులు, ఆక్వా సాగుదారులు, మత్స్యకారులతో మాట్లాడి ముంపునకు కారణాలను తెలుసుకుని పలు సూచనలతో కూడిన నివేదికను కలెక్టర్ శుక్లాకు అందజేసింది. దీనిపై కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా చర్చించింది.

రాజోలు దీవిలో సఖినేటిపల్లి మండలం గొంది, నవ్వా, రాళ్ల డ్రెయిన్‌లపై సుమారు తొమ్మిది వేల ఎకరాల వరి ఆయకట్టు ముంపు దిగాల్సి ఉంది. అధికారికంగా, అనధికారికంగా సుమారు 4 వేల ఎకరాల వరకూ ఆక్వా ఆయకట్టు పెరిగింది. వరి పొలాల నుంచి దిగే నీరు కన్నా, చెరువుల నుంచే వదిలేదే అధికంగా ఉండడంతో డ్రెయిన్‌లో నీరు ఎక్కువవుతోంది. పొలాలు, చెరువుల నుంచి ముంపునీరు ఈ కాలువల ద్వారా వశిష్ట నదీపాయలో కలవాల్సి ఉంది. ఇటీవల డ్రెయిన్ల ద్వారా ముంపు నీరు నదిలో కలిసే ప్రాంతంలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను ఆధునీకరించారు. అయినా పొలాల ముంపునీరు దిగడం లేదు. దీనిపై కలెక్టర్ శుక్లా అధ్యయన కమిటీ ఏర్పాటు చేయగా, బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పలు సూచనలు చేసింది.

ఆ సూచనలు ఇవే..

- గొంది అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద 2022లో తేలికపాటి తలుపులను ఏర్పాటు చేశారు. ఇవి మెరుగ్గా పనిచేస్తున్నాయని మెజార్టీ రైతులు చెబుతున్నారు.
- గొంది కాలువకు అనుబంధంగా ఉన్న రామేశ్వరం మీడియం డ్రెయిన్‌పై గతంలో వరి చేలు అధికంగా ఉండేవి. ఇప్పుడు ఆక్వా చెరువులు ఎక్కువగా ఉన్నాయి. ఈ చెరువుల నుంచి నీరు అధికంగా కాలువల్లోకి వదులుతున్నారు. ఇది గొంది డ్రెయిన్‌లోకి, అక్కడ నుంచి వశిష్ట నదీపాయ ద్వారా సముద్రంలో చేరాల్సి ఉంది. ఇక్కడకు సముద్రం తక్కువ దూరంలో ఉండడం వల్ల పోటు సమయంలో ముంపునీరు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా పూర్తి స్థాయిలో దిగడం లేదు.
- 2012 తరువాత గొంది డ్రెయిన్‌లో పూడిక తీయలేదు. ఆక్వా చెరువుల నుంచి పెద్దఎత్తున బురద కాలువల్లోకి వదలడం వల్ల పూడుకుపోయి నీరు దిగడం లేదు. దీనిని తొలగించాల్సి ఉంది.
- నొవ్వా అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను సైతం గొంది తరహాలో ఆధునీకరించారు. ఇక్కడ అర్ధ చంద్రాకారంలో తలుపులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కాని దీనికి సీఈ, సీడీవో అనుమతి లేదు.
- నొవ్వాతో పాటు రాళ్ల డ్రెయిన్‌లకు మధ్య ప్రకాశ్ నగర్ వద్ద అనధికార లింకు డ్రెయిన్ ఉంది. దీని వల్ల పైన నొవ్వా డ్రెయిన్ నుంచి కిందనున్న రాళ్ల డ్రెయిన్‌లోకి పోటు సమయంలో నీరు చొచ్చుకువస్తోంది. లింకు డ్రెయిన్‌ను శాశ్వతంగా పూడ్చి వేయాల్సి ఉంది.
- రాళ్ల కాలువ అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలావస్థకు చేరింది. కొత్త నిర్మాణానికి రూ. 2.04 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి పరిపాలనా ఆమోదం కోసం పంపించారు. కొత్తగా దానిని నిర్మించాలి.
- రాజోలు దీవిలోని వేపచెట్టు మీడియం డ్రెయిన్‌లో పూడిక తొలగించాల్సి ఉంది. గుడిమెళ్లంక వద్ద పాత అక్విడెక్టు స్థానంలో కొత్తగా అక్విడెక్టు కాని, సైఫన్ నిర్మాణం గాని చేపట్టాలి.
- శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ 16.40 కి.మీల నుంచి 22.70 కి.మీ వరకు తవ్వకాలు, సున్నా కిమీ నుంచి 8.50 కి.మీ వరకు డ్రెడ్జింగ్ చేసి 50 మీటర్ల వెడల్పు చేశారు. 8.50 కి.మీ నుంచి 16.40 కిమీ వరకు వదిలేశారు. కొన్నిచోట్ల డ్రెయిన్ వెడల్పు 10 మీటర్ల లోపు ఉండడం వల్ల ముంపునీరు దిగడం లేదు. సముద్ర పోటు సమయంలో డ్రెయిన్ పొంగుతోంది. ఈ డ్రెయిన్‌కు అనుబంధంగా ఉన్న గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణల బారిన పడింది. వీటిని తొలగించడంతో పాటు, డ్రెడ్జింగ్ చేసి వెడల్పు చేయాలి.

నిధుల మంజూరుకు కృషి



అంతర్వేది వద్ద గొంది, నొవ్వా, రాళ్ల కాలువలో పూడిక తీసేందుకు నిధుల మంజూరుకు కృషి చేస్తా. రాళ్ల డ్రెయిన్ వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు గతంలోనే ఉన్నాయి. వీటిని ప్రభుత్వానికి పంపిస్తాం. కలెక్టరేట్‌లో బుధవారం అధ్యయన కమిటీ సభ్యులు, డ్రెయిన్స్, హెడ్‌వర్క్స్, వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

ఓటు విలువ తెలపండి

- నమోదుకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు
- జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: యువతరానికి ఓటు విలువ తెలపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, దీనికోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువ ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకూ 26 వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. మరో పది రోజుల్లో డిగ్రీ, ఇంజినీరింగ్, తదితర కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి లక్ష్యం పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. కొత్తగా నమోదైన ఓటర్లకు కార్డులను స్పీడ్ పోస్ట్ ద్వారా అందజేసే ప్రక్రియ జిల్లాలో మొదలైందన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో యువత ఓటు నమోదు కోసం స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలు నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో 40 వేల దరఖాస్తులు అందాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. జిల్లాకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ నియమితులయ్యారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కె.చంద్రరావు, దూరి రాజేష్, అల్లాడ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ నుపూర్ అజయ్

అల్లవరం: స్పందన– జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అధికారులకు సూచించారు. బుధవారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డితో కలసి జేసీ 86 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన నిర్వహిస్తున్నామని, అలాగే బుధ, శుక్రవారాల్లో మండల స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారుల అర్జీలను నిశితంగా పరిశీలించి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1902ను ఏర్పాటు చేశామన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల్లో ఇబ్బందులు తలెత్తితే అర్జీదారులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం జేసీ నుపూర్ అజయ్, ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డిలను ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచులు సత్కరించారు. డీఆర్‌డీఏ పీడీ శివ శంకరప్రసాద్, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జీవీ సత్యవాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధుసూదన్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర, డీసీఎస్ఎస్ పద్మశ్రీరాణి, డీపీఓ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిధుల సేకరణకు చొరవ అభినందనీయం

కలెక్టర్ హిమాన్షు శుక్లా



కొత్తపేట ఆర్డీఓ ముక్కంటిని శాలువాతో సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సామాన్యులకు సేవే పరమావధిగా సాగుతున్న రెడ్‌క్రాస్ సంస్థకు అవసరమైన నిధుల సేకరణలో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి చొరవ అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సంస్థకు నిధులు సమకూర్చడంలో ప్రతిభ కనబరిచిన ఆర్డీఓ ముక్కంటిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదే తరహాలో జిల్లాలోని తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బ్లడ్ స్టోరేజ్ పాయింట్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో వివిధ సంస్థల సహకారం ద్వారా రూ.10.11 లక్షలు సేకరించి రెడ్‌క్రాస్ సంస్థకు అందించడం శుభసూచికమన్నారు. ఈ నిధులను బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటుకు వినియోగిస్తామన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా సంస్థ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ), సెక్రటరీ డాక్టర్ పీఎస్ శర్మ, కో ఆర్డినేటర్ వై.ప్రసాద్, జంపన బుచ్చిరాజు, మధురాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో లోకేష్ పాదయాత్ర

రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు బాబి



జిన్నూరి బాబి

అమలాపురం టౌన్: బూటకపు హామీలతో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర సాగుతుందని, వాటిని నమ్మేస్థితిలో ప్రజలు లేరని రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడారు. యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరవైందన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సాగిందని, అప్పట్లో అనూహ్య స్పందన వచ్చిందని గుర్తుచేశారు. అదే ఇప్పుడు లోకేష్ పాదయాత్రలో టీడీపీ నాయకులు, యువగళం టీమ్ ముందే డబ్బులిచ్చి తీసుకుని వచ్చిన కిరాయి జనంతో ఫోటోలు తీసి వాస్తవ పరిస్థితులను మసిపూసి మారేడు కాయ చేస్తున్నారన్నారు. కిరాయి జనాన్ని అదేదో అధిక జనం గుమిగూడినట్లు పచ్చ పత్రికల్లో విస్తృత ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీలో దాక్కుని పాదయాత్రకు డుమ్మా కొట్టారని, ఇప్పుడు బాబుకు బెయిల్ వచ్చిన తర్వాత అదేదో శూరత్వంలా బయటకు వచ్చి పాదయాత్రను పునఃప్రారంభించారని గుర్తు చేశారు. పాదయాత్రలో లోకేష్ ప్రసంగాలు విని ప్రజలు నవ్వుకుంటున్నారని బాబి తెలిపారు.

క్లుప్తంగా

కమ్మని మామిడి.. తిందాం పదండి



మామిడి చెట్టుకు కాసిన కాయలు

పిఠాపురం: మార్చి రాకుండానే మామిడి పండ్లు ఏమిటి అనుకుంటున్నారా..! అవును నిజమేనండి. కొత్తపల్లిలో యువ రైతు ఉల్లి సురేష్ తన పొలంలో మూడేళ్ల కిందట నాటిన మామిడి చెట్టు ఇప్పుడు కాపు కాస్తోంది. గత నెల రోజులుగా సుమారు 50 మామిడి పండ్లు కాసినట్లు సురేష్ తెలిపారు. ఇది పందిరి మామిడి రకానికి చెందిన చెట్టు అని వివరించారు.

మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో 17 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 1న కాకినాడ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఇంట్లోకి చోర్‌బడకుండా..

- చోరీల నివారణకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం
- వినియోగించుకోవాలంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: సెలవులు వచ్చాయని.. పెళ్లిళ్లకని... బంధువుల ఇంటికని ఇతర ఊళ్లకు వెళ్లేవారికి ఎప్పుడూ గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి.. ఇంటికి తాళం వేసి వెళ్తున్నా వచ్చేసరికి ఏం జరుగుతుందోననే భయం ఉంటోంది. ఎందుకంటే తాళాలు బద్దలు కొట్టి ఇంటిని గుల్ల చేస్తున్న ప్రబుద్ధులు ఉంటుండగా, ఇలా జరుగుతున్న ఘటనలు కోకొల్లలు. అలాంటి భయం, ఆందోళనకు చెక్ పెట్టేలా 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం'ను పోలీసు వ్యవస్థ తీసుకొచ్చింది. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పోలీసులు కోరుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దొంగతనాల నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం 'లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం' (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచిస్తున్నారు. సెలవులపై వేరే ప్రదేశాలు, తీర్థ యాత్రలు, ఇతర శుభకార్యాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని, ఇంట్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఈ సిస్టం వినియోగించుకోవాలని అంటున్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, రిక్వెస్ట్ పోలీసు వాచ్‌ను ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఎలా చేయాలో ఆయన వివరించారు. అవి ఇలా..

ఏం చేయాలంటే..

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను ముందుగా ఆండ్రాయిడ్ యూజర్స్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐ ఫోన్ యూజర్స్ యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేయాలి.
- ఈ యాప్‌లో వినియోగదారులు ముందుగా తమ పేరు, మొబైల్ నంబరు, చిరునామా వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్‌ను ఆ ఇంటి వద్దే ఉండి చేస్తే ఆటోమేటిక్‌గా ఇంటి లాంగిట్యూడ్, లాటిట్యూడ్ కూడా పోలీసు వారి వద్ద నమోదవుతుంది. వెంటనే వారి మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఒక వినియోగదారునిగా పోలీసు వద్ద నమోదు అయినట్టు ఒక రిజిస్ట్రేషన్ నంబరు కూడా వస్తుంది.
- ఆ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి బయటకు వెళుతున్నప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌లో ఫలానా తేదీ నుంచి ఎన్ని రోజులు ఊరు వెళ్తున్నారో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.
- ఆండ్రాయిడ్ మొబైల్ లేని వినియోగదారులు, ఆండ్రాయిడ్ మొబైల్స్‌ను ఆపరేట్ చేయలేని వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ఫోన్ నంబర్లు 94932 06371, 99084 54580కు తెలియజేయాలి. వెంటనే వినియోగదారుల ఇంటికి పోలీసు వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమేరా అమర్చుతారు.
- కెమేరాను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తారు. అప్పటి నుంచి ఆ ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుంది.
- ఆ ఇంట్లోకి ఎవరైనా దొంగలు ప్రవేశిస్తే కెమేరా పనిచేయడం ప్రారంభించి ఫోటోలు, లైవ్ వీడియోను పోలీసు కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. అలాగే కంట్రోల్ రూమ్‌లో ఒక అలారం మోగుతుంది. తద్వారా పోలీసు స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే దొంగతనాన్ని అరికట్టి, దొంగను పట్టుకుంటారు.



లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ పోస్టర్



ఈ సేవలు.. పూర్తి ఉచితం



లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా అందిస్తున్న సేవలు పూర్తిగా ఉచితం. దొంగతనం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందుగానే ప్రజలు స్పందించి ఈ సేవలను వినియోగించుకోవాలి. దీనిపై ఇప్పటికే పోలీసులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. బయట ఊళ్లకు వెళ్లే వారు తమ విలువైన సామగ్రిని భద్రపరుచుకోవాలి.

–పి.జగదీష్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

3 నుంచి గుంటూరులో అగ్రిటెక్-2023

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3, 4, 5 తేదీలలో గుంటూరు లాంలో అగ్రిటెక్-2023 నిర్వహిస్తామని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై సదస్సు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారదాజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఇతర మంత్రులు తదితరులు పాల్గొంటారన్నారు. తొలిరోజు ఆధునిక వ్యవసాయం సాంకేతికతపై సదస్సు, వ్యవసాయ విద్యా దినోత్సవం, అతిథుల సందేశం, వ్యవసాయ పరిశ్రమల నిధులతో నూతన ఆవిష్కరణలపై ముఖాముఖి, సాగులో డ్రోన్‌లు, రోబోలు- క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు లాభసాటి వ్యవసాయం కోసం నూతన పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల గురించి చర్చ, సాగు ఖర్చు తగ్గించి ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు తదితరాలపై శాస్త్రవేత్తల సందేశాలు ఉంటాయన్నారు. మూడో రోజు చిరుధాన్యాలు-సిరి మరియు పోషక ధాన్యాల గురించి వివరిస్తామన్నారు. అంతేకాకుండా వ్యవసాయంలో సాధించిన ప్రగతి, యాంత్రీకరణ, నూతన వంగడాలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

సైకాలజీపై అధ్యయనం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్

రాజానగరం: మానసిక ప్రశాంతతతో ఆలోచిస్తూ సైకాలజీపై అధ్యయనం చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. స్థానిక యూనివర్సిటీలో సొసైటీ ఫర్ రీసెర్చ్ అండ్ యాక్షన్, స్పృహ సైకాలజీ విభాగం, రాజమహేంద్రవరం రోటరీ క్లబ్, జీఎస్ఎల్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. 'సంపూర్ణత ద్వారా శ్రేష్ఠత' అనే అంశంపై స్పోర్ట్స్ సైకాలజీ, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్, 'నిద్ర సమస్యలు- ఆరోగ్యం' అనే అంశంపై అపోలో ఆస్పత్రి (హైదరాబాద్) వైద్యుడు చెన్నంశెట్టి విజయకుమార్ ఉపన్యసించారు. వివిధ సంస్థలు, కళాశాలలకు చెందిన 235 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, నిర్వహణ కార్యదర్శి సుంకర నాగేంద్రకిశోర్, సభ్యులు గూడూరి రాధిక, రాజేష్ ఖన్నా, బాడిన శ్రీనివాస్, చండీప్రియ, సైకాలజీ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ నక్కిన, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ పడాల, డాక్టర్ కృష్ణభవాని తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

- ఎనిమిది ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కొవ్వూరు డీఎస్పీ వర్మ వెల్లడి



పుల్లలపాడులో విలేకరులతో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ వర్మ

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడులో మంగళవారం రాత్రి తుపాకీతో దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావును హత్యచేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ వర్మ వెల్లడించారు. బుధవారం ఆయన పుల్లలపాడులో మృతుని కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాల కారణంగానే ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నామన్నారు. కక్ష కట్టిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. అనంతరం గ్రామానికి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా? వస్తే ఏ వాహనంలో వచ్చారు? ఎంతమంది వచ్చారనే విషయాలను ఆయన స్థానికుల నుంచి తెలుసుకున్నారు. ఆ రోజు సాయంత్రం చీకటి పడే సమయంలో పెద్ద సైజు తెల్లకారు వచ్చిందని, దాంట్లోంచి ఒక వ్యక్తి దిగి ప్రభాకరరావు ఇంటి వైపు వెళ్లి కొద్దిసేపట్లోనే వెనుతిరిగినట్లు గ్రామస్తులు వివరించారు. సాధారణంగా ప్రభాకరరావు ఇంటికి రోజూ అదే సమయంలో ఎవరో ఒకరు వస్తుంటారని, అదే రీతిలో వచ్చి ఉంటారని అనుకున్నామన్నారు. బుల్లెట్ శబ్దం వచ్చినా అది దీపావళి టపాసుల మోతగా భావించినట్టు వివరించారు.

లెక్క చూడాలని వచ్చి..

హత్యకు గురైన ప్రభాకరరావు తన చాతుర్యంతో చాలాచోట్ల, చాలా సందర్భాల్లో నెగ్గుకు వచ్చారు. మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన బాకీ పద్దు ఎంతో లెక్క చూడాలని అని చెప్పి, చివరకు ప్రభాకరరావును హతమార్చినట్లు మృతుని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డైట్ కళాశాలలో వచ్చే నెల 11, 12వ తేదీల్లో కళా ఉత్సవ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల ప్లస్‌లలో 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. గాత్రంలో సంగీతం, జానపదం, వాయిద్య సంగీతంలో వాయిద్య, మెలోడి, నాట్యంలో సంప్రదాయ, జానపద విభాగాల్లో పోటీలు డిసెంబర్ 11న ఉంటాయన్నారు. దృశ్య కళల్లో ద్విమితీయ, త్రిమితీయ, సంప్రదాయబద్ధ ఆట బొమ్మలు అండ్ ఆటలు, నాటిక (ఏకపాత్రాభినయం) విభాగాల పోటీలు 12న నిర్వహిస్తామన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి ఒక్కొక్క కళా రూపంలో ఒక బాలుడు, ఒక బాలిక (విడివిడిగా) పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పాల్గొనే విద్యార్థులు అవసరమైన సామగ్రి తెచ్చుకోవాలన్నారు. పాఠశాల తరఫున పాల్గొనే వారి వివరాలను, పోటీ అంశాలను ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు ఈ-మెయిల్ gdieteg@gmail.comకు డిసెంబరు 8వ తేదీలోగా పంపి రిజిస్టర్ చేయించుకోవాలని రమణ తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు అధ్యాపకులు కె.గంగాధరరావు (94403 39416), ఎస్.బాలరాజు (89196 91293)ను సంప్రదించాలన్నారు.

నేడు ధర్మపథం కార్యక్రమం



ధర్మపథం కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ధర్మపథం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. గ్రామ, గ్రామాన హిందూ, సనాతన ధర్మం ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మపథం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. అయినవిల్లి వినాయకుని అభిషేకం, హోమం, వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దీనికిగాను ఆత్రేయపురం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను బుధవారం పారిశ్రామికవేత్త మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, చిలువూరి బాబిరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి భక్తులంతా విచ్చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం



హిందీ సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

రాయవరం: కోనసీమ జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెలకు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతం మంది హాజరయ్యారు. సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్, హిందీ సబ్జెక్టు ఉపాధ్యాయులకు నిర్వహించారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 39, సబ్జెక్టు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు 48 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, మొయినుద్దీన్ సందర్శించారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



రాష్ట్ర బాస్కెట్‌బాల్ మహిళల జట్టు



పురుషుల జట్టు

రామచంద్రపురం: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగిన 8వ పురుషుల, మహిళల అంతర్ జిల్లాల పోటీల్లో 24 మంది పురుషులు, 24 మంది మహిళలను ఎంపిక చేశారన్నారు. వారికి చిత్తూరులో కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించి అందులో నుంచి 12 మంది మహిళలు, 12 మంది పురుషుల జట్లను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశామని చక్రవర్తి వివరించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ పంజాబ్‌లోని లూథియానాలో జరిగే 73వ జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. ఏపీ పురుషుల జట్టుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ కోచ్ వీఆర్ రుద్ర, మహిళల జట్టుకు గేమ్‌పాయింట్ కోచ్ పి.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ కోచ్ పి.సుకన్యలు కోచ్‌లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరీ టి.చెంగలరాయుడు, సెలక్షన్ కమిటీ ప్రెసిడెంట్ ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు వీరే..

పురుషుల జట్టులో గూడుపు గణేష్, ఐబీపీసీహెచ్ వర్మ, బి.పవన్‌కుమార్, జి.అరవిందవర్మ, ఎస్.ఇమ్రాన్, ఎస్‌కే ఆలీషా, జి.సత్యప్రకాష్, వీఎన్ దుర్గాప్రసాద్, ఎస్.ఇంతియాజ్, జి.అనిల్, కె.ద్వారకాంత్‌రెడ్డి, కె.జయకృష్ణ ఉన్నారు. మహిళల జట్టుకు బి.లీలావతి, ఆర్.మహతి, వీఆర్పీ యాదవ్, వి.సోహనా, బి.భవానీదేవి, బీవీ దుర్గ, బి.కుసుమ కుమారి, మహ్మద్ హఫీజ్, జి.సంధ్య, డి.ప్రభుదీపిక, ఎన్.వెంకటలక్ష్మి, ఒ.కుందన ఎంపికయ్యారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థులు



తైక్వాండో జట్టుతో సంఘు కార్యదర్శి అర్జునరావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డిసెంబర్ 1 నుంచి 3 వరకూ డెహ్రాడూన్‌లో జరిగే 37వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు సంఘ కార్యదర్శి బి.అర్జునరావు బుధవారం తెలిపారు. టీసీఎన్ శ్రీచరణ్, ఎ.దినకర్, డి.ధనుష్, బి.అనుదర్శిత్, కేవీ నరసింహమూర్తి, బి.హర్షవర్ధన్, ఆర్‌హెచ్‌వీ మూర్తి, కె.లాస్య, జి.లాహితితేజ, వై.ఆశ్రిత, పూజితాదేవి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 18, 19 తేదీలలో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించారన్నారు. వీరిని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, తైక్వాండో సంఘ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రిఫరీలు సత్యనారాయణ, తులసి, మూర్తి, కేవీ సత్యనారాయణ అభినందించారు.

నేత్రపర్వంగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం



సామర్లకోటలో భీమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు



పంచారామ క్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. కార్తిక మాసంలో స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బ్యాండ్ మేళాలు, వేదమంత్రాల మధ్య ఆలయ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువచ్చారు. వివిధ పుష్పాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు పూజాదికాలు నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఈఓ టి.వెంకట సూర్యనారాయణ, తెప్పోత్సవం నిర్వహించే దాతలు కటకం సతీష్, సురేష్ దంపతులు వేదికపై పూజలు చేశారు. బాణసంచా కాల్పుల మధ్య స్వామి, అమ్మవార్లకు ఆలయ కోనేరులో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. మూడు పర్యాయాలు స్వామివారి జలవిహారం కనుల పండువగా జరిగింది. అనంతరం దాతల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి సేవలందించారు.